క్లుప్తంగా

నేడు కానూరులో 2కే రన్

పెనమలూరు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం కానూరులో 2కే రన్ నిర్వహిస్తున్నామని జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ సోమవారం తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర సహకారంతో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు పంట కాలువ జంక్షన్‌లో క్రీడాజ్యోతి వెలిగించి 2కే రన్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సెయింట్ థెరిసా పాఠశాలలో బాడీ బిల్డర్స్ ప్రదర్శన, పలు క్రీడలు నిర్వహిస్తామని అన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు ఇస్తామని నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ సుంకర రాము తెలిపారు.

కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన పద్మావతీదేవి

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు పంచాయతీ ఇన్‌చార్జ్ (పూర్తి అదనపు బాధ్యతలు) కార్యదర్శిగా పెదపులిపాక పంచాయతీ కార్యదర్శి వి.పద్మావతీదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెనమలూరు కార్యదర్శిగా పని చేసిన రాధాకృష్ణ పంచాయతీ నిధులు రూ.92 లక్షలు స్వాహా చేశారన్న ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పద్మావతీదేవిని నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు ఇచ్చారు.

యువకుడిపై ముగ్గురి దాడి

పెనమలూరు: మండలంలోని తాడిగడప సెంటర్‌లో ఓ యువకుడిపై ముగ్గురు దాడి చేసిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలో కొండా చందు నివసిస్తున్నాడు. అతను తాడిగడప సెంటర్‌లో ఒక షాపులో సేల్స్ బాయ్‌గా పని చేస్తున్నాడు. చందు ఆదివారం షాపులో ఉన్న సమయంలో అతడికి తెలిసిన సన్నీ, మరో ఇద్దరు వచ్చి డబ్బులు కావాలని అడిగారు. తన వద్ద డబ్బులు లేవని చందు చెప్పగానే సన్నీ, మరో ఇద్దరు ఆగ్రహంతో వ్యక్తం చేస్తూ అతడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం

కంకిపాడు: మదర్ థెరిసా సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ మేదం డ్రావు కుటుంబరావు అన్నారు. గాడ్ హెల్ప్ సొసైటీ, మదర్ థెరిసా సోషల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కంకిపాడు సీహెచ్‌సీలో మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకుని రోగులకు పండ్లు పంపిణీ చేపట్టారు. కుటుంబరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. గాడ్ హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు, మదర్ థెరిసా సోషల్ ఆర్గనైజేషన్ ప్రతినిధి టి.నరసింహారావు, నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని వినతి

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో కొండ పోరంబోకు భూమిలో 40 ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు షేక్ కాశిం కోరారు. ఈ మేరకు సోమవారం మచిలీపట్నంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కోరామని కాశిం తెలిపారు. కొండ పోరంబోకులో నిరుపేద కుటుంబాలు చాలా సంవత్సరాలుగా ఉంటున్నాయని పేర్కొన్నారు. జీఓ 310 ప్రకారం ప్రభుత్వం గతంలో కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. మిగిలిన పేదలకు కూడా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు

పెనమలూరు: ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసి మరొకరికి చూపు ప్రసాదించి వారి జీవితంలో వెలుగులు నింపాలని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ మేనేజర్ ప్రసన్నలక్ష్మి సూచించారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. నేత్రదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని కోరారు. వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నేత్రదానం చేసే వారు తమను సంప్రదించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడుకు సమృద్ధిగా తాగునీరు

- పట్టణ ప్రజలకు తీరనున్న తాగునీటి కష్టాలు
- జలజీవన్ మిషన్ నుంచి రూ.2.37 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో సమస్య పరిష్కారం


కంకిపాడు పట్టణంలో నిర్మాణంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం


పైపులైను విస్తరణ పనుల కోసం సిద్ధంగా ఉన్న పైపులు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడు పట్టణ వాసులకు సమృద్ధిగా తాగునీరు అందనుంది. ఇప్పటికే రక్షిత మంచినీటి పథకం నిర్మాణం తుదిదశకు చేరుకుంది. పైపు లైను విస్తరణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా అందిస్తే అతిత్వరలోనే ప్రజలకు సురక్షిత తాగునీరు అందుతుంది. ఇప్పటి వరకూ మండల కేంద్రమైన కంకిపాడు వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం దొరకనుంది.

రూ.2.37 కోట్ల నిధులు మంజూరు

కంకిపాడు పట్టణంలో ప్రధాన గ్రామానికి ఒక రక్షిత మంచినీటి పథకం ద్వారానే ప్రస్తుతం తాగునీటి సరఫరా జరుగుతోంది. దీని వల్ల సమృద్ధిగా తాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. సమస్యను స్థానిక పాలకవర్గ ప్రతినిధులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన చొరవతో జల్ జీవన్ మిషన్ నుంచి రూ 2.37 కోట్ల నిధులు పట్టణానికి మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని పద్మావతి నగర్‌లోని సామాజిక స్థలంలో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్‌కు రూ.3 లక్షల మేరకు అంచనాలు రూపొందించి నివేదికలు పంపారు. ఉత్తర్వులు మంజూరైతే విద్యుత్ సరఫరా అందించి, రంగులు వేస్తే మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరాకు మార్గం సుగమం అవుతుంది.

10 కిలోమీటర్ల మేర పైపులైన్లు

ప్రాధాన్యతా ప్రాంతాల్లో పైపులైను విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పది కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. బ్యాంకు కాలనీలో సుమారు 1900 మీటర్లు పైపులైను విస్తరణ పూర్తి కావాల్సి ఉంది. ఇది పూర్తయితే పైపులైను పనులు పూర్తయినట్లే. అందుకు అవసరమైన నిర్మాణ సామగ్రిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పని ప్రదేశంకు తరలించి సిద్ధంగా ఉంచారు. పనులు పూర్తయ్యి రక్షిత మంచినీటి పథకం ప్రజలకు అందుబాటులోకి వస్తే తాగునీటి ఇబ్బందులకు చెక్ పడినట్టే.

పైపులైన్ పూర్తి

పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే పైపులైను ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ట్యాంకు నిర్మాణం పూర్తయ్యింది. విద్యుత్ సరఫరా అందిస్తే ట్యాంకు అందుబాటులోకి వస్తుంది.

– రాచూరి చిరంజీవి, జేసీఎస్ చైర్మన్

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మాణం పూర్తవుతోంది. తాగునీటిని సురక్షితంగా ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నాం. పనులు జరుగుతున్న తీరుపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. త్వరలోనే ట్యాంకు ప్రారంభించి సురక్షిత నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

రైతుల సంక్షేమమే ధ్యేయం


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

ఉంగుటూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండల పరిధిలోని వేమండలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. రైతులకు ప్రభుత్వ సేవలు చేరువ చేసేందుకు గ్రామానికి ఒక ఆర్బీకే ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను రైతులకు శాస్త్రవేత్తల ద్వారా తెలియజేస్తూ వ్యవసాయ సహాయకులు నిత్యం అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించదగిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచ్ అనుమోలు నిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, వైఎస్ఎంపీపీ-2 చంద్రశేఖర్, ముక్కపాడు సచివాలయం పరిధిలోని సర్పంచులు సుజాత, అంజనాదేవి, ఇందుపల్లి సర్పంచ్ వెంకటలక్ష్మి, వేమండ, నందమూరు ఎంపీటీసీలు నాగిరెడ్డి, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, వింత ఆదినారాయణరెడ్డి, నక్కా రాజు, రాంబాబు, ఎం.ప్రసాద్, శీమయ్య, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, వ్యవసాయశాఖ ఏడీఏ సునీల్, ఏవో హరీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ కార్యదర్శులకు శిక్షణ

విజయవాడరూరల్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 41 మండలాల్లో పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తానని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.జ్యోతి బసు ఆదేశాలు జారీ చేశారు. గ్రేడు 1, గ్రేడు 5 పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీకి సంబంధించిన వివిధ రకాల సబ్జెక్ట్ లకు సంబంధించి వసతితో కూడిన శిక్షణ కార్యక్రమాలకు నిర్వహించడానికి అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు సోమవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లాలోని 25 మండలాలకు చెందిన 418 మంది, ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండలాలకు చెందిన 289 మందికి అనగా మొత్తం 707 పంచాయతీ కార్యదర్శులకు బ్యాచ్‌ల వారీగా కృష్ణాజిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాలు, మచిలీపట్నం, ఎన్టీఆర్ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు గుణదల లోని సోషల్ సర్వీస్ సెంటర్‌లో నిర్వహిస్తారని తెలియజేశారు.

అంతర్గత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు అంతర్గత నైపుణ్యాలు మెరుగు పరుచుకున్నప్పుడే మంచి ఉపాధి అవకాశాలు పొందగలుగుతారని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'బిజినెస్ అనలిటిక్స్' అంశంపై వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం నూతన పుంతలు తొక్కుతోందన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను అవగాహన చేసుకుని ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఎంబీఏ విభాగాధిపతి బి.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమ సంసిద్ధత కోర్సులు, నూతన మెలకువలపై అవగాహన పెంపొందించేందుకు 5 రోజుల పాటు వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్క్‌షాపులో అడ్వాన్స్ ఎక్సెల్, పవర్ బీటీ ద్వారా బిజినెస్ అనలిటిక్స్‌లోని అంశాలపై శిక్షణ ఇస్తానున్నట్లు తెలిపారు. చివరి రోజు బిజినెస్ అనలిటిక్స్ అంశాలపై టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ కృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడిచర్ల భూసమస్యలను పరిష్కరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం మడిచర్లలో భూసమస్యలను పరిష్కరించి, దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి రైతులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ఆర్.ఎస్.నంబర్.1లో 952 ఎకరాల అటవీ భూమి ఉందని, ఈ భూమిని దశాబ్దాలుగా సాగు చేస్తున్న ఎస్టీ, ఎస్సీ, బీసీలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అటవీభూమిలో రెవెన్యూ అధికారులు వందల ఎకరాలను బడాబాబులకు ధారాదత్తం చేశారని, ఏకంగా అటవీ భూములకు గిరిజనేతరులకు పట్టాదారు పాసుపుస్తకాలను సైతం మంజూరు చేశారని ఆరోపించారు. గ్రామంలోని పేద రైతులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న 363-1ఏలోని 34.50 ఎకరాల భూమిని సెక్షన్ 22ఏ కింద నిషేధిత భూముల జాబితాలో చేర్చటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని వాపోయారు. మాదిగలపోడులో దశాబ్దాలుగా సాగు చేస్తున్న ఎస్సీ రైతులకు ఇప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదని, ఈ భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ భూముల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొండపావులూరి రమేష్, సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు భూక్యా దేవి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అజ్మీరా కృష్ణ, మాజీ సర్పంచ్ భూక్యా శ్రీను నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా మదన్‌మోహన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు, జెండాచెట్టు సెంటర్, విజయ ఆగ్రో కట్ట, ఎస్సీ కాలనీ, రైల్వేకట్ట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడికి గాయాలు

పెనమలూరు: మండలంలోని పోరంకి సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గాయపడ్డాడు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పోరంకి డొంకరోడ్డులోని మిత్రా అపార్టుమెంట్‌లో విశ్రాంత ఉపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు నివసిస్తున్నారు. ఆయన ఈ నెల 27వ తేదీ కూరగాయల కోసం బైక్ పై పటమట రైతుబజార్‌కు వెళ్లాడు. రైతుబజార్ నుంచి తిరిగి బైక్ పై ఇంటికి వచ్చే క్రమంలో పోరంకి సెంటర్‌లో మలుపు తిరుగుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు గాయపడటంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న డైరెక్టర్లు

సూరంపల్లి(గన్నవరం): సీపెట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎన్.రవికుమార్, బీవీఆర్ మోహన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపల్లిలో ఉన్న సీపెట్‌లో సోమవారం ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో పీఎం-అజయ్ నిధుల ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ మూడు నెలల కాల పరిమితి కలిగిన కోర్సు పూర్తిచేసుకున్న యువత చెన్నైలోని మదర్సన్ ఆటోమోటివ్ కంపెనీ, కోలార్‌లోని ల్యూమేక్స్ ఆటో మొబైల్ కంపెనీలో రూ.15 వేలు వేతనంతో ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేషన్ ద్వారా తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. సీపెట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌తో పాటు డిప్లొమా కోర్సుల ద్వారా ప్లాస్టిక్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. త్రయోదశి సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీ మహానంద్రీశ్వర స్వామికి అభిషేకం, అర్చన చేశారు. శ్రీపార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జి.ఆర్.వి.సాగర్, అర్చకులు పూజా కార్యక్రమాలు చేశారు.

రెజ్లింగ్ చాంపియన్‌గా నున్న జెడ్పీ హైస్కూల్


విజేతలైన విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని దాసరి కామేశ్వరరావు మెమోరియల్ ఓపెన్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. టోర్నీలో 120 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ 16 బంగారు, 17 రజత పతకాలను సాధించి విజేతగా నిలిచింది. అత్యధిక పతకాలు అండర్-14 కేటగిరీ రెజ్లర్లే సాధించారు. 9 బంగారు, 2 రజతాలతో ఉంగుటూరు హైస్కూల్ ద్వితీయ స్థానం, విజయవాడ కొత్తపేట ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ 8 బంగారు, 8 రజత పతకాలతో తృతీయ స్థానంలో నిలిచాయి. టోర్నీ ప్రారంభానికి ముందు ఎన్టీఆర్ జిల్లా చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్, హెచ్ఎం భూపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ధ్యాన్‌చంద్, దాసరి కామేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు విజయవర్మ, టి.శ్రీలత, ఓల్డ్ స్టూడెంట్స్ ప్రతినిధి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పతకాలను అందజేశారు.

మెరుగైన వైద్యసేవలకు ప్రభుత్వం కృషి


పునాదిపాడులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధా ప్రసూజ

కంకిపాడు: మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ సుధా ప్రసూజ అన్నారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలోని పునాదిపాడు, గొల్లగూడెం గ్రామాల్లో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు, 104 వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సుధా ప్రసూజ రోగులకు కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. శుక్లాలు ముదిరిన వృద్ధులకు అవసరమైన శస్త్రచికిత్స కోసం సిఫారసు చేస్తామన్నారు. డాక్టర్ సుధా ప్రసూజ మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా నూతన విధానాలను అమలులోకి తెచ్చిందని వివరించారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జయశ్రీ, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రైమావేరా సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ప్రారంభం


ప్రసంగిస్తున్న క్యాడ్ నిపుణుడు ప్రసాద్

పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రైమావేరా సాఫ్ట్‌వేర్‌కు చాలా ప్రాధాన్యత ఉందని క్యాడ్ నిపుణుడు కె.ప్రసాద్ తెలిపారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ప్రైమావేరాపై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో భవనాలు, రోడ్లు నిర్మాణంలో ప్రైమావేరా సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ.. వారం పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో ఓ బాలుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ అర్జున్‌రాజు కథనం మేరకు.. యనమలకుదురు కరకట్ట వైఎస్సార్ నగర్‌కు చెందిన మున్నంగి బాజీబాబుకు ఇద్దరు పిల్లలు కేతశ్రీ, హరిసంపత్ (11)ఉన్నారు. అతని ఇంటి సమీపంలో రెండో అంతస్తులో ఒక యువకుడి పెళ్లి సందర్భంగా హరిసంపత్‌ను తోడి పెళ్లికొడుకుగా కూర్చోపెట్టారు. హరిసంపత్ భవనంపై ఆడుకునే క్రమంలో ప్రమాదవశాత్తు అతని చేయి విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ఘటనలో బాలుడి చేయి మోచేయి వరకు కాలిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జగనన్న స్వచ్ఛ సంకల్పంపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఎం.శేఖర్ బాబు నాయకత్వంలో కళాకారుల బృందం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాటలు, బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచి బడుగు బాలమ్మ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆలా చేస్తేనే ఆరోగ్య వంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యబాబు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు



ఉయ్యూరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం రీజనల్ హెడ్ కె.వెంకటరావు అన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో కస్టమర్స్ ఔట్‌రీచ్ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథి వెంకటరావు మాట్లాడుతూ.. 70 ఏళ్ల క్రితం రైతుల ప్రయోజనార్థం యూనియన్ బ్యాంకు ప్రారంభమయిందని పేర్కొన్నారు. సులభ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేసి గృహనిర్మాణాలకు, విద్యా ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణసదుపాయం విస్తృతం చేశామన్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.జయరాం, మచిలీపట్నం హెడ్ చీఫ్ మేనేజర్ పరమేశ్వరరావు, ప్రతినిధులు హిమబిందు, ఎం.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

నాంచారయ్యకు జీవన సాఫల్య పురస్కారం



ఉయ్యూరు: ఉయ్యూరుకు చెందిన విశ్రాంత ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎర్రపోతు వెంకట నాంచారయ్యకు ఎస్వీ రంగారావు జీవన సాఫల్య పురస్కారం లభించింది. నాటక రంగంలో విశేష ప్రతిభ కనబర్చినందుకు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 2023 సంవత్సరానికి గానూ నాంచారయ్యకు ఈ పురస్కారం అందించింది. ఈ నెల 27న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తాను పురస్కారం అందుకున్నానని నాంచారయ్య తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

కంకిపాడు: వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన పరిశే కస్తూరి (65) గ్రామంలోని కుమార్తె వద్ద ఉంటోంది. ఆమె కాలుకి పుండు రావటంతో ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటోంది. షుగరు వ్యాధి వచ్చిందని, మెరుగైన వైద్యం కోసం విజయవాడ, గుంటూరు వెళ్లాలని ఆర్ఎంపీ వైద్యుడు సూచించారు. దీంతో ఈ నెల 22వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమెను ఎక్కడికి వెళ్తున్నావంటూ స్థానికులు ప్రశ్నించారు. ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి వారికి చెప్పివెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కస్తూరి కుమార్తె కె.సుజాత ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.